

ఎమ్మెల్యేలు రైతులను పరామర్శించాలి

- ఎకరాకు రూ.50 వేల పరిహారమివ్వాలి - సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్
- కలెక్టరేట్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా - గేట్లను తెరచుకుని లోపలికి వెళ్లిన సిపిఎం కార్యకర్తలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

అధికార పార్టీ ఎమ్మెల్యేలు 'గడపగడపకు' పేరుతో ఇంటింటికీ వెళ్లి పథకాలపై ప్రచారం చేసుకోవడం కాదని, పంట పొలాల దగ్గరికి వెళ్లి నష్టపోయిన రైతులను పరామర్శించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. అధిక వర్షాలతో పాటు మాండూస్ తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. మాండూస్. తుపాను, నకిలీ విత్తనాలు సాగు చేసి నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలని గురువారం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ధర్నా చేపట్టారు. ఏ ఒక్క అధికారి కూడా వినతిపత్రం తీసుకునేందుకు బయటకు రాకపోవడంతో సిపిఎం కార్యకర్తలు ఆగ్రహించారు. కలెక్టరేట్ గేట్లను తెరచుకొని లోపలికి వెళ్లారు. పోలీసులు వెంటనే వారిని నిలువరించి సిపిఎం నాయకులతో మాట్లాడారు. ఇంత పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తున్నా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వచ్చి కనీసం వినతిపత్రం తీసుకోవడానికి కూడా తీరిక లేదా అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి వచ్చిన సూపరింటెండెంట్‌కు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యలను వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని అక్కడికి వచ్చిన వ్యవసాయ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. అంతకుముందుకు సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో గౌస్‌దేశాయ్ మాట్లాడారు. కర్నూలు జిల్లాలో అత్యధికంగా పత్తి పంట సాగు చేసి రైతులు నష్టపోయారని తెలిపారు. దీనికి వాతావరణంలో వచ్చిన మార్పులే కారణమని వ్యవసాయ అధికారులు గుడ్డిగా మాటలు చెప్పడం బాధాకరమన్నారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఇలాంటి ప్రకటనలు చేయడం రైతులను మోసగించడమేనని మండిపడ్డారు. నకిలీ పత్తి విత్తనాలు సాగు చేసి రైతులు నష్టపోయారని తెలిపారు. నకిలీ విత్తనాలను సరఫరా చేసిన కంపెనీలపై క్రిమినల్ కేసులు పెట్టడమే కాకుండా ఆ కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల మాండూస్ తుపాను వల్ల జిల్లాలోని మిరప, వరి పంటలకు పెద్దఎత్తున నష్టం వాటిల్లిందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం ఎక్కడా పంట నష్టం జరగలేదని ప్రకటించారని చెప్పారు. ఆదోని మండలంలోని అనేక గ్రామాల్లో పంటలన్నీ నష్టపోతే ఇంతవరకు అక్కడికి వ్యవసాయ శాఖ అధికారులు వెళ్లి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర కూడా అందడం లేదని తెలిపారు. టమోటా పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు మార్కెట్ యార్డుకు తీసుకొచ్చి తక్కువ ధరకు అమ్ముకొని వెళుతున్నారని వాపోయారు. రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే కలెక్టర్ జోక్యం చేసుకొని ఇటీవల అధిక వర్షాలు, మాండూస్ తుపాను వల్ల జరిగిన నష్టాలను అంచనా వేసి ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. అలాగే నకిలీ విత్తనాలు సాగు చేసి నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలని కోరారు. లేకపోతే ఈనెల 22న అన్ని వామపక్ష పార్టీలతో కలిసి వేలాది మంది రైతులతో కలెక్టరేట్ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ మాట్లాడుతూ... ఈ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని చెప్పుకుంటూ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. జిల్లాలో పెద్ద ఎత్తున ఉపాధి కూలీలు తరలిపోతున్నా అధికారులు పనులు కల్పించడం లేదన్నారు. ఉపాధి కూలీలకు పనులు చూపడమే కాకుండా కూలి కూడా పెంచాలని డిమాండ్ చేశారు. సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి రాముడు, జిల్లా నాయకులు గురుశేఖర్, ఎస్ఎ.సుభాన్, ఎమ్‌డి.ఆనంద్ బాబు, నగేష్, నగర నాయకులు విజయ్, షరీఫ్, సాయిబాబా, అబ్దుల్ దేశాయ్, పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఈ.పుల్లారెడ్డి పాల్గొన్నారు. **పత్తికొండ**లోని కామ్రేడ్ ఈశ్వర్ రెడ్డి భవనం నుంచి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం దగ్గర పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, వీరశేఖర్ మాట్లాడారు. ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని చిప్పగిరి, పత్తికొండ, తుగ్గలి, ఆస్పరి, దేవనకొండ, ఆలూరు మండలాల్లో నకిలీ పత్తి విత్తనాలతో రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అడ్మినిస్ట్రేటివ్ అధికారి సతీష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం ఆస్పరి మండల నాయకులు బాలకృష్ణ, తుగ్గలి మండల నాయకులు శ్రీరాములు, కొండారెడ్డి, నాయకులు బజారి, అశోక్, సూరి, యూసుఫ్, రంగస్వామి, దస్తగిరి, గోపాల్, వెంకటేశ్వర్ రెడ్డి, రాముడు, నరసన్న, మధుబాబు, కాశీ, కాశీ విశ్వనాథ్, రమేష్, వినోద్, వీరన్న, గంగన్న, మస్తాన్, సిద్ధయ్య, నాగేష్, శ్రీరాములు, బడే సాబ్, ప్రతాప్, రామాంజనేయులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్



పత్తికొండలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

మంచి దిగుబడులు వచ్చాయి...

- కలెక్టర్ కోటేశ్వరరావు
- వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకం, వరి పంట కోత ప్రయోగం తనిఖీ

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

ఈసారి సాధారణ దిగుబడుల కంటే అధిక దిగుబడులు వచ్చాయని కలెక్టర్ పి.కోటేశ్వరరావు తెలిపారు. గురువారం వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకం, వరి పంట కోత ప్రయోగాన్ని కలెక్టర్ కోటేశ్వర రావు తనిఖీ చేశారు. వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకంలో భాగంగా కర్నూలు మండలం మునగాలపాడు గ్రామంలో వరి పంట ఎంపికైనందున అక్కడ జరుగుతున్న పంట కోతను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకంలో భాగంగా ఒక్కో గ్రామానికి ఒక యూనిట్ ఇస్తారని తెలిపారు. అందులో భాగంగా కర్నూలు మండలం మునగాలపాడు రెవెన్యూ గ్రామానికి గ్రామ ఇన్స్యూరెన్స్ యూనిట్ నెంబరు 53 కేటాయించామని చెప్పారు. గ్రామ ఇన్స్యూరెన్స్ యూనిట్ నెంబరు 53లో రైతుకు సంబంధించిన సర్వే నెంబరు 45లో వరి పంట కోత ప్రయోగం నిర్వహించామని తెలిపారు. పంట దిగుబడులను చూసిన తర్వాత ఈసారి సాధారణ దిగుబడులు కంటే అధిక దిగుబడులు వచ్చాయని చెప్పారు. అక్కడే ఉన్న పొలానికి సంబంధించిన రైతు ఈరన్న... ఈసారి దిగుబడులు బాగా వచ్చాయని కలెక్టర్‌తో ఆనందం వ్యక్తం చేశారు. కలెక్టర్ రైతు ఈరన్నతో మాట్లాడుతూ... పంట దిగుబడి అయిపోయాక మళ్లీ వేరే పంట వేసుకోవచ్చా అని ప్రశ్నించారు. రైతు ఈరన్న స్పందిస్తూ... మళ్లీ వేరే పంట కూడా వేసుకుంటానని కలెక్టర్‌కు వివరించారు. సిపిఒ అప్పలకొండ, డివిజినల్ ఉప గణాంక అధికారి భాస్కర్, సుధాకర్, సహాయ గణాంక అధికారి శివన్న, వ్యవసాయ విస్తరణ అధికారులు అబ్దుల్ మువిన్, మైమున్నీసా బేగం పాల్గొన్నారు.


పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

ఎమ్మెల్యేల్లో టెన్షన్...

- పనితీరుపై నేడు సిఎం సమీక్ష
- సరిగ్గా పనిచేయని వారిని గట్టిగా హెచ్చరించే అవకాశం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి



అధికారపక్ష ఎమ్మెల్యేల్లో టెన్షన్ నెలకొంది. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్‌పై ఇప్పటి నుంచే ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యేల పని తీరుపై శుక్రవారం ఆ పార్టీ అధినాయకుడు జగన్ సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమీక్షలో ప్రధానంగా 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సాగిన తీరుపైనే చర్చ సాగే అవకాశం ఉంది. గత సమీక్ష సమావేశాల్లోనూ ఇదే ప్రధాన అంశంగా సాగింది. అప్పట్లో 'గడపగడపకు' సరిగ్గా తిరగని ఎమ్మెల్యేలను, మంత్రులను, మాజీ మంత్రులను సైతం జగన్ హెచ్చరించారు. పని తీరు మెరుగుపరచుకోకపోతే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వడం సాధ్యం కాదని తీవ్రంగా హెచ్చరించారు. ఈ సారి జరిగే సమీక్ష సమావేశంలోనూ సరిగ్గా పనితీరు కనబరచని ఎమ్మెల్యేలను మరోసారి గట్టిగా మందలించే పరిస్థితి ఉందని సమాచారం. ఎన్నికలకు ఏడాదిన్నర మాత్రమే గడువు ఉండడంతో ఎన్నికల వ్యూహాలపై వైసిపి అధిష్టానం దృష్టి సారించింది. రెండు జిల్లాల్లోనూ 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా 14 చోట్లా వైసిపి ఎమ్మెల్యేలే ఉన్నారు. ప్రజల్లో తిరగని, గ్రూపు తగాదాలతో చికాకులు తెప్పిస్తున్న ప్రజాప్రతినిధులపైన జగన్ దృష్టి సారించినట్లు తెలిసింది. కొంత మంది ఎమ్మెల్యేలు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని తూతూమంత్రంగా సాగిస్తున్నట్లు అధినాయకత్వం భావిస్తోంది. పలు నియోజకవర్గాల్లో గ్రూపు తగాదాలు కొనసాగుతుండడంపైనా వైసిపి అధిష్టానం సీరియస్‌గా ఉన్నట్లు చర్చ సాగుతోంది. ఇప్పటికిప్పుడు చెప్పకపోయినా సరిగ్గా పనిచేయని ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో సీటు ఇవ్వకూడదని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పుడే ప్రకటిస్తే ఇబ్బందికర పరిస్థితులు నెలకొనే అవకాశం ఉండడంతో ప్రస్తుతం హెచ్చరికలతో సరిపెట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సక్రమంగా నిర్వహించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తే వచ్చే ఎన్నికల్లో గెలుపు తథ్యమని వైసిపి భావిస్తోంది. ఈ కార్యక్రమం సరిగ్గా అమలు చేయని వారిపై ప్రధానంగా దృష్టి సారిస్తోంది. సిట్టింగుల్లో ఎంతమందికి టిక్కెట్ దక్కుతుందోననే చర్చ ఇప్పటికే వైసిపిలో నడుస్తోంది. వచ్చే మార్చి వరకూ గడపగడపకు కార్యక్రమం ఉండడంతో సిట్టింగు ఎమ్మెల్యేల పనితీరులో మార్పునకు అవకాశం ఉందనే చర్చ కూడా సాగుతోంది.

మహిళల హత్య కేసు నిందితులను శిక్షించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్
- ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద బాధిత కుటుంబానికి పరామర్శ
- శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ నిర్మల, కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత పరామర్శ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

మహిళల హత్యకేసు నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు దారుణ హత్యకు గురయ్యారు. గురువారం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. మార్చురీ వద్ద బాధిత కుటుంబ సభ్యులను సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల, కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, టిడిపి పాణ్యం ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకటరాముడు, ఐద్వా ఓల్డ్ సిటీ కార్యదర్శి పద్మలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నన్నూరు గ్రామానికి చెందిన కురువ రామేశ్వరమ్మ, కురువ రేణుకలు ఇద్దరూ కలిసి పొలంలో గడ్డి కోసేందుకు వెళ్లి దారుణ హత్యకు గురయ్యారని తెలిపారు. ఈ హత్యలకు పాల్పడిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డాగ్స్ స్క్వాడ్‌తో హంతకులను త్వరగా పట్టుకోవాలని కోరారు. మహిళల తల్లిదండ్రుల కోరిక మేరకు మృతదేహాలను వారి పొలాల వద్దే పూడ్చాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కోరారు.


జిజిహెచ్ మార్చురీ వద్ద బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న గౌస్ దేశాయ్, నిర్మల


పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళ్లులర్పిస్తున్న కలెక్టర్

ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఆంధ్ర రాష్ట్ర అవతరణ పితామహుడు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆయనకు ఘనంగా గురువారం నివాళులర్పించారు. నగరంలోని స్థానిక ఎస్‌బిఐ బ్రాంచ్ సర్కిల్ సమీపంలో ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు గాంధీజీ స్ఫూర్తితో సబర్మతి ఆశ్రమంలో చేరి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారన్నారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధనకు ఆమరణ దీక్ష చేపట్టి అమరుడయ్యారని కొనియాడారు. **కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో :** జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో డిసిసి అధ్యక్షుడు సుధాకర్ బాబు, నాయకులు జాన్ విల్సన్, అశోక రత్నం, దామోదరం రాధాకృష్ణ, పోతుల శేఖర్‌లతో పాటు పలువురు పొట్టి శ్రీరాములు, పటేల్ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. **కర్నూలు క్రైమ్ :** కర్నూలు జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎఆర్ అదనపు ఎస్పీ నాగబాబు నివాళులు అర్పించారు. ఏఆర్ డిఎస్‌పి ఇలియాజ్ బాషా, డిపిఒ ఏవో సురేష్ బాబు, ఆర్‌ఐలు సురేంద్ర రెడ్డి, రవికుమార్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. **కర్నూలు కార్పొరేషన్ :** కర్నూలు జిల్లా కేంద్ర గ్రంధాలయంలో పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు జిల్లా గ్రందాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క, గ్రంథాలయాధికారులు వజ్రాల గోవిందరెడ్డి, ఛంద్రమ్మ, నషీమాబీ, యస్ బాష, ఈశ్వరమ్మ, ఉమ, ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ మగ్బుల్ బాష, సుదర్శన్, రాజు తదితరులు నివాళులర్పించారు. అలాగే కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయ కౌన్సిల్ హాల్‌లో కమిషనరు భార్గవ్ తేజ, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ శేష సాయి, డిప్యూటీ కమిషనరు ఎస్‌బి.రమాదేవి, కార్యదర్శి లావణ్య, మేనేజరు చిన్న రాముడు తదితరులు నివాళులు అర్పించారు.


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

గొల్లలదొడ్డి పాఠశాలలో టీచర్ల కొరత

- చివరికి వంట మనిషితో బోధన - నాణ్యమైన విద్య కరువయిందని తల్లిదండ్రుల ఆవేదన
- సమస్య పరిష్కరించాలని తరగతి గదికి తాళం వేసి సర్పంచి నిరసన

ప్రజాశక్తి - సి.బెళగల్

మండలంలోని గొల్లలదొడ్డి ప్రాథమికోన్నత పాఠశాలలో టీచర్ల కొరత వేధిస్తోంది. టీచర్ల కొరత సమస్యను పరిష్కరించడంలో ఎంఇఒ జ్యోతి మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రధానంగా ఈ పాఠశాలను ఇటీవల ప్రాథమిక స్థాయి నుండి ప్రాథమికోన్నత స్థాయికి పెంచారు. గతంలో 1 నుండి 5 వరకు 85 మంది విద్యార్థులు విద్యానభ్యసించేవారు. స్థాయి పెంచాక 1వ తరగతిలో 19 మంది విద్యార్థులు, 2లో 15, 3లో 14, 4లో 25, 5లో 25, 6లో 15, 7లో 15 ఇలా మొత్తం 128 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల హెచ్‌ఎం నాగరాజు నాడు-నేడు పనులకే పరిమితమయ్యారు. మరొక టీచర్ నరసింహులు ఉన్నారు. ఉన్న ఒక్క గదిలోనే ఏడు తరగతులకు ఒక్కరే దిక్కయ్యారు. మరొకరు రాజారావు విధులు నిర్వహిస్తుండగా ఆయనను ఎంఇఒ కర్నూలు సమీపంలోకి డిప్యుటేషన్‌పై పంపించారు. గొల్లలదొడ్డి మండలంలోని మారుమూల గ్రామం కావడంతో రాకపోకలతో ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. ఇలాంటప్పుడు కాస్త ఆలస్యమైన వేళ చివరికి వంటమనిషి బోధన అందించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడే తల్లిదండ్రులు వారి పిల్లలకు నాణ్యమైన విద్య కరవయిందని ఆవేదన చెందుతున్నారు. గురువారం టీచర్ల సమస్య పరిష్కారం చేయాలని సర్పంచి రామలింగమ్మ, ఆమె కుమారుడు లోకేష్ తరగతి గదికి తాళం వేశారు. తక్షణమే ఎంఇఒ జ్యోతి, ఇతర అధికారులు అక్కడికి చేరుకొని చర్చలు కొనసాగించారు. అయినా సమస్యకు స్పష్టత రాలేదని, ప్రాథమిక విద్య పట్టుతప్పుతోందని, కనీసం జిల్లా అధికారులయినా స్పందించాలని గ్రామస్తులు మీడియాతో వాపోతున్నారు.


గొల్లలదొడ్డి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల


విద్యార్థులకు బోధన చేస్తున్న వంట మనిషి

జగనన్న గోరుముద్దలో కర్నూలు అగ్రస్థానం

- విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సామ్యూల్ పాల్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జగనన్న గోరుముద్ద పథకం, మధ్యాహ్న భోజన పథకం అమల్లో కర్నూలు జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో అగ్రస్థానంలో నిలిచిందని విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సామ్యూల్ పాల్ వెల్లడించారు. గురువారం దేశ రాజధాని న్యూఢిల్లీలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌నకు హాజరైన ఏడి సామ్యూల్ పాల్ పలు వివరాలను నివేదించారు. జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారంలో ఒకరోజు జిల్లా కలెక్టర్ మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకుంటున్నారన్నారు. ప్రతివారం మండల స్థాయి అధికారులు నోడల్ అధికారులతో ఈ పథకం అమలు తీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతున్నామన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ఇవ్వడమే కాకుండా రోజు కోడిగుడ్డు, చిక్కిలు కూడా అందజేస్తున్నామన్నారు. ఆయాలకు ప్రతినెల రూ.3 వేల చొప్పున వేతనం అందజేసి మరింత పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. ఈ వివరాలపై ఆయా రాష్ట్రాల నుండి విచ్చేసిన విద్యాశాఖ ప్రతినిధులు కర్నూలు జిల్లాలో అమలవుతున్న మధ్యాహ్నం భోజనం పథకం తీరుపై అభినందనలు తెలియజేశారు.


మాట్లాడుతున్న విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సామ్యూల్ పాల్

మెడికవర్ హాస్పిటల్స్ నూతన సంవత్సర హెల్త్ ప్యాకేజీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పటల్

మెడికవర్ హాస్పిటల్స్ నూతన సంవత్సర హెల్త్ ప్యాకేజీ (రూ.11,200 విలువగల ప్యాకేజీ కేవలం రూ.2499 మాత్రమే) బ్రోచర్‌ను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యమని, ఆరోగ్యాన్ని మించిన సంపద మరొకటి లేదన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ప్రజలందరూ నూతన సంవత్సరంలో ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు వైస్ ప్రెసిడెంట్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అత్యాధునిక సదుపాయాలతో, అనుభవజ్ఞులైన డాక్టర్స్ చేత 24/7 సేవలను అందిస్తున్న మెడికవర్ హాస్పిటల్స్ ఈ నూతన సంవత్సరంలో అందరికి ఆరోగ్యం అందుబాటులో ఉండటం కోసం రూ.11,200 విలువగల ప్యాకేజీ కేవలం రూ.2499లకి అందిస్తున్నామన్నారు. ఇందులో 13 రకాల టెస్ట్‌లు, నలుగురు డాక్టర్ కన్సల్టేషన్స్ అందిస్తున్నామని, ఈ ఆఫర్ ఈ నెల 15 నుంచి 2023 జనవరి 31 వరకు మాత్రమేనని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు సెంటర్ హెడ్ నీలారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రత్యేక ప్యాకేజీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కలుగొట్ల అగ్రవర్ణాలపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కలుగొట్ల గ్రామంలో దళిత సర్పంచి మద్దిలేటి పట్ల అవమానకరంగా వ్యవహరించిన అగ్రవర్ణాల వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర రెడ్డి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కలుగొట్ల పంచాయతీ కార్యాలయానికి వేసిన తాళాలు తీయించాలన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకొని, పంచాయతీ కార్యాలయానికి వేసిన తాళాలు తీయించాలని డిమాండ్ చేశారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - పత్తికొండ

సేవాదళ్ ఆధ్వర్యంలో ఉచిత ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణా తరగతుల శిబిరాన్ని పోచిమి రెడ్డి సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షులు పోచిమి మురళీధర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ముందుగా పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని యువతీ యువకులు దూర ప్రాంతాలకు వెళ్ళనవసరం లేకుండా పత్తికొండలో శిక్షణ తరగతులు ప్రారంభించామన్నారు. ఈ నెల 16 నుండి జనవరి 18వ తేదీ వరకు తరగతులు జరుగుతాయని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. డిసెంబర్ 21న జగనన్న జన్మదినం సందర్భంగా పోచమ్మ రెడ్డి సేవా దళ్‌లో సభ్యులందరికీ రూ. 2 లక్షలు ఇన్సూరెన్సు ఉచితంగా అందజేస్తామన్నారు. టెట్ కోచింగ్, కానిస్టేబుల్ కోచింగ్ తీసుకున్న వారికి కూడా రెండు లక్షల రూపాయల ఇన్సూరెన్స్‌ను ఉచితంగా అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు అనిత, దేవరగట్టు లక్ష్మి, వార్డు మెంబర్లు బోడా సావిత్రి, లైట్ నాగరాజు, మాజీ ఉప సర్పంచ్ కోటేశ్వరరావు, గోవిందరాజు, బారిక బసన్న, పులికొండ రామానాయుడు, బోడా శీను, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న పోచిమి మురళీధర్ రెడ్డి

యువత చిరు పరిశ్రమలు స్థాపించాలి

- ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ డైరెక్టర్ కోటి రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



సమావేశంలో మాట్లాడుతున్న కోటిరెడ్డి

గ్రామాల్లోని యువత చిరు పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ డైరెక్టర్ కోటి రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్, కాటన్ మర్చంట్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం నిర్వహించారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ డైరెక్టర్ కోటి రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకటనారాయణ, దేవేంద్ర కుమార్, గౌతమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ డైరెక్టర్ శివప్రసాద్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ శ్యామలమ్మ, శివ ప్రసాద్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకటనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కోటి రెడ్డి మాట్లాడారు. జిల్లాలోని నిరుద్యోగులు ఉపాధి అవకాశాల కోసం చిరు పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల మండలి శివప్రసాద్ మాట్లాడారు. ఆదోని డివిజన్ పరిధిలోని ప్రతి గ్రామంలోనూ పిఎంఈజిపి పథకం ద్వారా లబ్ధి పొందేందుకు ముందుకు రావాలని తెలిపారు. చిరు పరిశ్రమలు స్థాపించే విధంగా యువత ముందుకు రావాలని కోరారు.

వైసిపితోనే గ్రామాలాభివృద్ధి

- వైసిపి తాలూకా బాధ్యులు నారాయణస్వామి

ప్రజాశక్తి - హొళగుంద



ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నారాయణస్వామి

వైసిపి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని వైసిపి ఆలూరు తాలూకా బాధ్యులు గుమ్మనూరు నారాయణ స్వామి తెలిపారు. గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా నాలుగు సచివాలయాలకు ముంజూరైన రూ.80 లక్షలతో మంజూరైన సిసి రోడ్డు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాలుగు సచివాలయాల పరిధిలో అత్యవసరంగా ప్రజలకు ఇబ్బందిగా ఉన్న రోడ్లను గుర్తించి సిసి రోడ్డు, డ్రెయినేజీ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామాల్లో చాలా రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటికి కూడా త్వరలో నిధులు ముంజూరు చేస్తామని చెప్పారు. అనంతరం థర్డ్ పార్టీ వారితో జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతగా ఉండాలని గుత్తేదారులకు సూచించారు. ఎంపిడిఒ దాసు నాయక్, హౌసింగ్ డిఇ ఆదినారాయణ, పిఆర్ ఎఇ సోమప్ప, వైసిపి కన్వీనర్ షఫీవుల్లా, వైసిపి ఆలూరు కన్వీనర్ వీరేష్, వైసిపి నాయకులు ఈసా, రంగప్ప, రామకృష్ణ, సోమిరెడ్డి, పంపాపతి, ఎస్ఐ అబ్దుల్ జహీర్ పాల్గొన్నారు.

మూల రాములకు విశిష్ట పూజలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో మూల రాములకు పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు విశేష పూజలు నిర్వహించారు. గురువారం స్థానిక శ్రీమఠంలో రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములు, జయరాములు, దిగ్విజయరాముల మూర్తులను స్వర్ణ పీఠంపై ఉంచి క్షీరాభిషేకంతో పాటు పుష్పార్చన, మంగళ హారతులు ఇచ్చారు. అంతకుముందు పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు మూల రాములు, జయరాములు, దిగ్విజయరాముల మూర్తులను భక్తులకు చూపిస్తూ ప్రత్యేకతను వివరించారు. అనంతరం స్వర్ణమయమైన బృందావనాన్ని దర్శించుకున్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు : ఎడిఎ

ప్రజాశక్తి - నందవరం



రైతులకు సూచనలు ఇస్తున్న ఎడిఎ మహ్మద్ ఖాద్రీ

విత్తనశుద్ధి వల్ల విత్తనం, నేల ద్వారా వచ్చే పురుగులు, తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చని ఎమ్మిగనూర్ ఎడిఎ మహ్మద్ ఖాద్రీ తెలిపారు. గురువారం మండలంలోని నది కైరవాడి గ్రామంలో రెండోవారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కనిపించని శిలీంద్రాల బారి నుంచి విత్తనాలను రక్షించుకోవాలంటే విత్తనశుద్ధి ఆవశ్యకత ఎంతో ఉందని తెలిపారు. దీనివల్ల మొలక శాతం ఎక్కువ ఉంటుందని, మొక్కల సంఖ్య కూడా పెరిగి మంచి దిగుబడి సాధించవచ్చని చెప్పారు. విత్తన శుద్ధి విత్తనానికి రక్షణ కవచంలా పనిచేస్తుందని తెలిపారు. మొక్క ఆరోగ్యంగా పెరిగి, తొలిదశలో పురుగు, తెగుళ్లను అరికట్టి, తర్వాత దశలో పిచికారి మందులు, కూలీలపై పెట్టే ఖర్చును తగ్గించుకోవడానికి తోడ్పడుతుందని చెప్పారు. ఎఒ స్రవంతి, వ్యవసాయ విస్తరణాధికారి సురేంద్ర, ప్రభావతి, విజయ్, రైతులు పాల్గొన్నారు.

'నకిలీ' కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

- అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి - సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న రామాంజనేయులు



ఆదోని సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నకిలీ విత్తనాలు తయారు చేసి కంపెనీలపై చర్యలు తీసుకోవాలని, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు కోరారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక సోమప్ప సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. తాలూకా వ్యవసాయ అభివృద్ధి అధికారి ఖాద్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు, సిపిఎం తాలూకా నాయకులు హనుమంతు, మండల నాయకులు రాముడు, ఎపి రైతు సంఘం తాలూకా నాయకులు లక్ష్మీ నరసయ్య మాట్లాడారు. పత్తి, మిరప సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని, నకిలీ విత్తనాలకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నకిలీ విత్తనాలకు సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం నాయకులు నరసింహులు, లక్ష్మీనరసయ్య, దేవిపుత్ర, వ్యకాస డివిజన్ కార్యదర్శి ఎస్.తిమ్మన్న, డివైఎఫ్ఐ నాయకులు సురేష్, రవి, ఎం.అబ్దుల్లా, స్వామి దాసు పాల్గొన్నారు. **ఆదోని** సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అంతకుముందు సుందరయ్య భవన్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు మున్సిపల్ రోడ్డు మీదుగా ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు, సీనియర్ నాయకులు ఈరన్న, మహానంద రెడ్డి మాట్లాడారు. రైతులకు జరిగిన అన్యాయాన్ని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందన్నారు. పెద్దకడబూరు మండల కార్యదర్శి తిక్కన్న మాట్లాడుతూ... కల్లుకుంట గ్రామంలో వందల ఎకరాల్లో పంట నష్టపోయారని, రైతులతో ఆందోళన చేపట్టగా శాస్త్రవేత్తలు పంటలను పరిశీలించారని తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఫర్టిలైజర్ విత్తన దుకాణాలపై త్వరలోనే తనిఖీ నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హామీఇచ్చారు. శాస్త్రవేత్తల నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. కౌతాళం మండల కార్యదర్శి మల్లయ్య, కోసిగి కార్యదర్శి రాముడు, ఆదోని పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మణ్, లింగన్న, నాయకులు గోపాల్, శేఖర్, తిప్పన్న, తిక్కప్ప, అయ్యప్ప ఉన్నారు.

రీసర్వేలో తప్పులకు ఆస్కారం ఉండకూడదు : తహశీల్దార్

ప్రజాశక్తి - హాలహర్వి



భూముల రీసర్వేలో తప్పులకు ఆస్కారం లేకుండా చూడాలని తహశీల్దార్ మల్లికార్జున తెలిపారు. గురువారం మేదేహాల్ గ్రామంలో రీసర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని పది గ్రామాల్లో రీసర్వే నిర్వహించినట్లు తెలిపారు. భూముల రికార్డులను పరిశీలించి రైతులకు భూ సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆయా గ్రామాల్లో విఆర్ఒలు, సర్వేయర్లు పొలాలకు వెళ్లి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. రైతులు కూడా పొలాలకు సంబంధించిన రికార్డులను అందజేస్తే అధికారులు పక్కాగా కొలతలు వేస్తారని చెప్పారు. విఆర్ఒ రాఘవేంద్ర స్వామి, గ్రామ సర్వేయర్ సురేష్ పాల్గొన్నారు.

అనుమానిత వ్యక్తుల సమాచారం ఇవ్వాలి

- ఆదోని రైల్వే ఎస్ఐ రామస్వామి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని రైల్వే స్టేషన్ పరిధిలో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలని ఆదోని రైల్వే ఎస్ఐ రామస్వామి తెలిపారు. గురువారం రైల్వే పోలీసు స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లు, రైల్వే కూలీ పోటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైళ్లలో దొంగతనాలకు పాల్పడే వారిపై ప్రత్యేకంగా ఉంచామని తెలిపారు. రైల్వే ప్లాట్ ఫామ్‌పై అనుమానాస్పదంగా తిరిగినా, చోరీకి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత నేరస్తులు, దోపిడీ, దొంగతనాలకు పాల్పడే వారి ఆచూకీ కోసం గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనుమానిత వ్యక్తుల వేలి ముద్రలు సేకరిస్తున్నామని తెలిపారు. నేరాలతో సంబంధం నిర్ధారణ కోసం ఈ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మ్యాచింగ్ కాగానే ఆ వ్యక్తిని సంబంధిత పోలీసులకు అప్పగిస్తామన్నారు. రైళ్లలో దొంగ రవాణాపై కూడా నిఘా పెట్టామన్నారు. పోలీసులకు సమాచారమిచ్చి సహకరించాలని కోరారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న రైల్వే పోలీసులు

చెత్త పనులు చేసేందుకు వెళ్లి...

- ఒక్కసారిగా పేలుళ్లు

- ప్రమాదంలో గాయపడిన తండ్రి, కుమారులు

- కుమారుని పరిస్థితి విషమం

ప్రజాశక్తి - చిప్పగిరి

ఒకప్పుడు పొలాల్లో పని చేసుకుంటూ పదిమందికి దీటుగా ఆ రైతు గ్రామంలో బతికారు. గతేడాది పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయారు. అప్పుల ఊబిలో కూరుకుపోయారు. తనకున్న పొలాలను సైతం వేరే రైతులకు కౌలుకు ఇచ్చి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదుకు వలస వెళ్లారు. అక్కడ చెత్త సేకరణ పనులు చేసేవారు. రోజు మాదిరిగా గురువారం సాయంత్రం తండ్రి, కుమారులు చెత్త సేకరిస్తుండగా ఒక్కసారిగా పేలుళ్లు సంభవించాయి. ఇద్దరూ గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి... మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన హుస్సేని చంద్ర ఈ ఏడాది కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ నగరానికి చెత్త పనులు చేసేందుకు వెళ్లారు. గురువారం హుస్సేని చంద్ర, తన కుమారుడు సురేష్‌తో కలిసి చెత్త సేకరిస్తుండగా అక్కడ పెద్దఎత్తున శబ్దంతో కూడిన పేలుళ్ల సంభవించింది. ఈ శబ్దానికి ఒక్కసారిగా చంద్ర ఒకవైపు, కుమారుడు సురేష్ మరోవైపు ఎగిరిపడ్డారు. ఈ సంఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. గమనించిన చుట్టుపక్కల వారు అంబులెన్స్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిన చంద్రకు స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు, కుమారుడు సురేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న నంచర్లలోని బంధువులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులు, గ్రామస్తులు భారీ ఎత్తున హైదరాబాద్‌కు హుటాహుటాన తరలివెళ్లారు.

మహారాజ శ్రీ కర్నూలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.NO.1387/2021

K.నాగన్న. ...వాది

-Vs-

G. వెంకటేశ్వర్లు తండ్రి
G. బుగ్గన్న ఇంటి నెం.
91/4-30-1-7, బాలజి నగర్,
కర్నూలు. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

పై నంబరు దావాలో వాది ప్రతివాది నుండి దావా మొత్తము రూ.4,30,000/- లు, ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 27-12-2022 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 27-12-2022

K. **మోహన్ బాబు,**
వాది పరం న్యాయవాది,
కర్నూలు.

రాష్ట్రంలో తుగ్లక్ పాలన : కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్రంలో తుగ్లక్ పాలన సాగుతోందని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ విమర్శించారు. గురువారం మండలంలోని నగరూరు, బినిగేరి, చిగిలి గ్రామాల్లో టిడిపి మండల కన్వీనర్ పరమారెడ్డి ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ... మన రాష్ట్రానికి' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని తెలిపారు. పథకాల పేరుతో వైసిపి ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతోందని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వంలో గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయని తెలిపారు. నగరూరు గ్రామస్తులు మాట్లాడుతూ... గ్రామంలో నీరు, రోడ్ల సమస్య తీవ్రంగా ఉందని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని ఆమె హామీఇచ్చారు. టిడిపి మండల కార్యదర్శి శేషాద్రి నాయుడు, సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ సలి సాహెబ్, మండల మాజీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, ఎంపిటిసిలు నరసప్ప, రహీంతుల్లా, ఎల్లప్ప, నాయకులు తిమ్మన్న, సుదర్శన్, హనుమంతు రెడ్డి, నారాయణ, సతీష్ పాల్గొన్నారు.



ఆస్పరిలో మాట్లాడుతున్న టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ

నగరూరులో టిడిపి, వైసిపి నాయకుల మధ్య వాగ్వాదం

నగరూరు గ్రామంలో 'ఇదేం ఖర్మ... రాష్ట్రానికి'ని నిర్వహించారు. టిడిపి, వైసిపి నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సుజాతమ్మ మాట్లాడు తూ... వైసిపి ప్రభుత్వం నగరూరులో ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు స్థలాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటోందని, శ్మశానంలో ఇవ్వడంతో ఏ ఒక్కరూ వెళ్లలేదని తెలిపారు. శ్మశానాన్ని గుంతలు పూడ్చి రూ.6 లక్షల బిల్లు చేసుకొని వైసిపి నాయకులు తిన్నారన్నారు. అక్కడున్న వైసిపి నాయ కులు కలుగజేసుకొని గతంలో పదేళ్ల అధికారంలో ఉన్నారు కదా, ప్రజలకు ఏం చేశారంటూ ప్రశ్నించారు. ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు వచ్చి ఇరు పార్టీలకు సర్ది చెప్పి పంపించారు.

మంత్రాలయం : రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలన తుగ్లక్ పాలనకు నిదర్శనమని, ఈ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మండలంలోని సూగూరు గ్రామంలో క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ... మన రాష్ట్రానికి' నిర్వహించారు. టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి సోదరుడు పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి ఇంటింటికీ తిరుగుతూ ప్రజలు సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్ పాలన ప్రజలకు నచ్చడం లేదని, రాబోయే రోజుల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలపై చెత్త పన్ను, ఇంటి పన్ను వంటి అనేక పన్నులు వేస్తూ ప్రజలను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. సూగూరు నాగేష్, భాస్కర్ రెడ్డి, సుజ్ఞానం, పాండురంగ, ఐ టిడిపి అధ్యక్షులు సల్మాన్ రాజు, శంకరప్ప, రామకృష్ణ, ఆళ్లప్ప, యోహాను, జాన్ పాల్గొన్నారు.



సమస్యలను వివరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : ADONI
I.P. NO. 5/2020

B.Thimmaiah Setty. ...Petitioner

-Vs-

V.Sreenivasulu and other. ...Respondents

3,5,9 రెస్పాండెంటులకు నోటీసు

R3. B.Seetharami Reddy S/o B.Sankar Reddy, Finance Business, Mallapallu (v), Mantralayam (m), Kurnool Dist.
R5. U.Chennamma S/o Sunnapu Reddy, Lakshmi Peta, yemmiganur Town, Kurnool Dist.
R9 Balaji, Tilak Nagar, Yemmiganur Town, Kurnool Dist.

పై నెంబరులో ఐ.పిలో అర్జీదారు బి.తిమ్మయ్య శెట్టి తనను దావాళాదారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో ఐ.పి అర్జీ దాఖలు చేసినది. ఇందుపైన 3,5,9 రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 22-12-2022వ తేది పగలు 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుప కోవలెను. లేనియెడల మీ పరోక్షమున పై అర్జీని విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది:22-12-2022

పి.వెంకటేశ్వర్లు,
కె.తాయన్న,
ఆదోని,పిటీషనర్ తరుపు న్యాయవాదులు.
కర్నూలు.

సచివాలయ జాయింట్ సెక్రటరీగా లావణ్య

ప్రజాశక్తి - హాలహర్వి

ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా లావణ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు గునిపి రాజేష్ అధ్యక్షతన రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సచివాలయ ఉద్యోగుల సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. కర్నూలు జిల్లా నుంచి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా ఉన్న హాలహర్వి గ్రామ మహిళా పోలీసు పి.లావణ్యను రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ అజయ్ కుమార్, రాయలసీమ జిల్లాల కోఆర్డినేటర్ ఎం.రాజేష్, రాష్ట్ర కోశాధికారి బి.పాండురంగ పాల్గొన్నారు.

మారెమ్మ అవ్వ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో ప్రసిద్ధి చెందిన గెద్దరాళ్ల మారెమ్మ దేవత హుండీని గురువారం ఆలయ కార్యనిర్వాణాధికారి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో దేవదాయ శాఖ సిబ్బంది లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హుండీ లెక్కింపులో రూ.7,09,512, అర కిలో వెండి, అర తులం బంగారం లభించాయని తెలిపారు. వెండి, బంగారాన్ని హుండీలోనే ఉంచి నగదును ఎపిజిబి దేవనకొండ బ్యాంకులో జమ చేసినట్లు చెప్పారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ఆర్ అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరిన బనవాసి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

వైఎస్ఆర్ అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌లో బనవాసి జట్టు ఫైనల్‌కు చేరింది. నీలకంఠేశ్వర జాతర సందర్భంగా వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో వైఎస్ఆర్ అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. హై స్కూల్ కేటగిరీకి సంబంధించిన గురువారం వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో జరిగిన సెమీఫైనల్‌లో వీవర్స్ కాలనీ ప్రభుత్వ పాఠశాల సీనియర్స్ జట్టు, బనవాసి గ్రామానికి చెందిన దేవా లెవెన్ జట్లు తలపడ్డాయి. బనవాసి దేవా లెవెన్ జట్టు ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో ఫైనల్‌కు చేరింది. ఈ మ్యాచ్‌లో నరసింహ (30), జాన్ (22), వీరేష్ (18) పరుగులు చేశారు. బనవాసి జట్టును స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు తిరుమల్, రాజు, త్యాగరాజులు అభినందించారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

- టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి

ప్రజాశక్తి - ఆదోని

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టిశ్రీరాములు చిరస్మరణీయుడని టిడిపి కర్నూలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి కొనియాడారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు పొట్టిశ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు బుద్ధారెడ్డి, మాబాష, లక్ష్మీనారాయణ, బాలాజీ, వెంకటేష్, జయరాం, రవి, జగదీష్, కోట రామాంజనేయులు, నాగేందర్ రెడ్డి, శేష్ రెడ్డి, బసవరాజు, అయ్యన్న, అంజీవ్ గాంధీ, శాంతి, సాధికా బేగం, వీరేష్ ఉన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలో కోట్ల క్యాంపు కార్యాలయంలో పొట్టిశ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. టిడిపి నాయకులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి నాయకులు, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ జి.అల్తాఫ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, ఎమ్మిగనూరు మండలం ఆత్మ ఛైర్మన్ కందనాతి శ్రీనివాసులు, టిడిపి ముస్లిం, మైనార్టీ నాయకులు కెఎండి.జబ్బార్, గోరా బాషా, మహబూబ్ బాషా, 16వ వార్డు నాయకులు బెస్త హనుమంతు, టిడిపి గుడికల్ గ్రామ నాయకులు కోలంట్ల నాగరాజు, కోలంట్ల వెంకటేష్, ఆఫ్గాన్ వలీ బాష, కోట్ల క్యాంపు ఆఫీస్ ఇన్‌ఛార్జీలు కోడెగంటి శంకరన్న, ఎన్.ఆదెన్న పాల్గొన్నారు. అలాగే టిడిపి పట్టణ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి నాయకులు కొండయ్య చౌదరి, మున్సిపల్ టిడిపి ఫ్లోర్ లీడర్ దయాసాగర్, రంగస్వామి గౌడ్, మధుబాబు పాల్గొన్నారు.



ఆదోనిలో నివాళులర్పిస్తున్న భూపాల్ చౌదరి



ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

వెంకటలక్ష్మి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : వ్యకాస

ప్రజాశక్తి - దేవనకొండ

తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాకు వెళ్లి పాముకు కాటుకు గురై మృతి చెందిన వంకాయల వెంకటలక్ష్మి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు వీరశేఖర్ కోరారు. గురువారం ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతోందని విమర్శించారు. పనుల్లేక గ్రామీణ ప్రాంతాల ప్రజలు వలస వెళ్తున్నారని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ సీజన్ ముగుస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. మండలంలోని కోటకొండ గ్రామానికి చెందిన వంకాయల వెంకటలక్ష్మి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంకటలక్ష్మి మృతితో ఆమె భర్త, ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. వ్యకాస మండల కార్యదర్శి మహబూబ్ బాషా, ఉపాధ్యక్షులు యూసుఫ్ బాష, సీనియర్ నాయకులు బజారి పాల్గొన్నారు.

దళితులను చైతన్య పరచాలి

- దళిత సమాఖ్య వ్యవస్థాకులు కట్టా స్వామి దాస్

ప్రజాశక్తి - కౌతాళం



సమావేశంలో మాట్లాడుతున్న కట్టా స్వామి దాస్

ప్రతి గ్రామంలోనూ దళితులను చైతన్య పరచాలని దళిత సమాఖ్య వ్యవస్థాపకులు కట్టా స్వామి దాసు కోరారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ కార్యాలయంలో వివిధ గ్రామాల దళిత సమాఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయంగా, సామాజికంగా, విద్య పరంగా దళిత కుటుంబాల్లో చైతన్యం తీసుకు రావాలని తెలిపారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం కట్ట మరమ్మతులు చేపట్టేందుకు, ఏప్రిల్ 14న జరిగే అంబేద్కర్ జయంతికి కృషి చేయాలని తెలిపారు. దళిత సమాఖ్య నాయకులు బాష, తిమోతి, మారెప్ప, ముఖేష్ పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి : ఎఒ ఆనంద్

చిప్పగిరి : మండలంలోని అన్ని గ్రామాల రైతులు రబీలో సాగు చేసిన పంటలకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎఒ ఆనంద్ సూచించారు. గురువారం చిప్పగిరి వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈకేవైసీ కార్యక్రమం ప్రతి గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లు చేస్తున్నారని తెలిపారు. ప్రతి రైతూ రబీలో ఏ పంట సాగు చేశారో ఈకేవైసీలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈకేవైసీ చేసుకున్న రైతులకు మాత్రమే పథకాలు అందుతాయని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- న్యాయవాది సాయికుమార్

ప్రజాశక్తి - ఆదోని



వాహనాల రద్దీ కారణంగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని న్యాయవాది సాయికుమార్ కోరారు. గురువారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని పోలీసు కంట్రోల్ రూమ్ నుంచి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వరకు రోడ్డు రద్దీగా ఉంటుందని తెలిపారు. వాహనాలు వేగంగా రావడం వల్ల ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయన్నారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. కళాశాలలు, పాఠశాలలు వెళ్లే విద్యార్థులు ఆ రోడ్డు వెంటనే రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. రహదారి ఇరుకుగా ఉండడం వల్ల కూడా ప్రమాదాలకు ఆస్కారం ఉందని చెప్పారు. అక్కడక్కడ ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయించి అవగాహన కల్పించాలని కోరారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT ADONI
I.A.No. 292 OF 2022 IN O.S No 163 OF 2020

BETWEEN:
K Nazeer Ahmed. ...Petitioners

AND

1. K Shabuddin and Others. ...Respondents

NOTICE

To
1. D1.K Shabuddin Son of late K Md Haneef Muslim aged about 55 Years resident of H No 8-40-1 Siddappalayam Kosigi.
2. D3. K Amneeruddin Son of late K Md Haneef Muslim aged about 53 Years resident of H No 8-40-1 Siddappalayam Kosigi.
3.D4. K Mahboob Dowla Son of late K Md Haneef Muslim aged about 52 Years residentof H No 8-40-1 Siddappalayam Kosigi.
4. D8. K Jarina wife of Shaik Ahmed daughter of late K Md Haneef Muslim aged about49 Years resident of H No 8-40-1 Siddappalayam Kosigi.
5. D9. K Khursheed wife of K Illahi D/o of late K Md Haneef Muslim aged about 46Years resident of H No 8-40-1 Siddappalayam Kosigi.
6.D10. K Shahida wife of K Riyaz D/o of late K Md Haneef Muslim aged about 48 Years resident of H No 8-40-1 Siddappalayam Kosigi.
7.D11.K Thahera wife of late Rahman Basha D/o of late K Md Haneef Muslim agedabout 31 Years resident of H No 8-40-1 Siddappalayam Kosigi.
8.D12.K Abida wife of K Ahmed D/o of late K Md Haneef Muslim aged about 35 Years resident of H No 8-40-1 Siddappalayam Kosigi.
9.D13.D Shamim Banu wife of K Rahmatullah D/o of late K Md Haneef Muslim aged about 30 Years resident of H No 8-40-1 Siddappalayam Kosigi.
10.D14.K Ayesha wife of K Abdul Rahman D/o of late K Md Haneef Muslim aged about 57 Years resident of H No 8-40-1 Siddappalayam Kosigi.

WHEREAS the above named Petitioner has made an application for condoning delay in filling the petition to setaside the decree. As such you are hereby required to appear in this Court in person or by a pleader duly instructed on the 30th day of December 2022 at 10-30 AM to show cause of against the said Application, failing which the said Application will be heard and determined exparte.

ALHAJ A MANSOOR AHMED
ADVOCATE FOR THE PETITIONER

నందవరంలో మండల స్థాయి ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - నందవరం

నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అరుణ ఆధ్వర్యంలో గురువారం ఎంఇఒ సుదర్శన్ రెడ్డి మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థీ తెలివి తేటలను, నైపుణ్యాన్ని ఎగ్జిబిషన్ల ద్వారా వ్యక్త పరిచే అవకాశం ఉంటుందని చెప్పారు. విద్యార్థులు కచ్చితంగా ఎగ్జిబిషన్లల్లో పాల్గొని వారు తయారు చేసిన అంశాలపై వివరణ ఇవ్వడంతో సమాజంపై కూడా అవగాహన పెరుగుతుందన్నారు. మండలంలోని ఏడు పాఠశాలలు సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నాయని తెలిపారు. వాటిలో జిల్లా స్థాయికి పర్యావరణ హితం అంశంలో కెజిబివి, ఎపి మోడల్ స్కూల్, ఆరోగ్యం, పరిశుభ్రత అంశంలో నాగలదిన్నె జడ్‌పిహెచ్ స్కూల్, ముగతి, సాఫ్ట్ వేర్ అండ్ ఎపిపిలో నందవరం జడ్‌పిహెచ్ స్కూల్, పర్యావరణం, వాతావరణం మార్పులు అంశంలో కనకవీడు జడ్‌పిహెచ్ స్కూల్, గణిత నమూనా అంశంలో ఇబ్రహీంపురం ఉన్నత పాఠశాలలో ఎంపికయ్యాయని చెప్పారు. సైన్స్ టీచర్ రామలింగప్ప, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, సత్యన్న, జయన్న, ఎల్లప్ప, సుధాకర్, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.



విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యాయులు